# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహాకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కధా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కధలు..!!

# మనసున మనసై

" మనసున మనసై బ్రతుకున బ్రతుకై!!" మృదుమధురంగా వినిపిస్తున్న అమ్మ గొంతు. దాంతోనే మెలకువ వచ్చింది నాకు.

" అరే! అమ్మ అప్పు డే నిద్ర లేచిందే?" అనుకున్నాను బాత్ రూం లోకి వెళ్తూ..

మరో అరగంట కి టేబిల్ ముందు కూర్చున్న నాకు ప్లేట్ లో ఇడ్లీలతో ప్రత్యక్షమయింది అమ్మ. "నిమిష ని బాగా మిస్ అవుతున్నాను. కావ్య ఎప్పుడు వస్తుంది?" అంది తనే.

నిమిష నాకూతురు.. కావ్య నా భార్య. ఇద్దరూ మా అత్త గా రింటికి జయపూర్ వెళ్ళారు. వచ్చేనెల మా బావమరిది ఎంగేజ్ మెంట్. షాపింగ్ పనులకీ అదీ తల్లికి తోడుగా ఉండడానికి వెళ్ళింది కావ్య

అమ్మ మాతోనే ఉండడం వల్ల నిమిషకెంతో చేరిక తన దగ్గర. అది పుట్టిన ఈ రెండేళ్ళలోనూ మనవరాలిని నాలుగు రోజులకంటే ఎక్కువ వదిలి ఎప్పుడూ ఉండలేదు అమ్మ.

" వస్తారు లే అమ్మా! నాలుగు రోజులేగా అయింది వెళ్ళి" అన్నాను నవ్వుతూ..

అమ్మ కూడా నవ్వింది. తెల్లటి చూడీదార్ వేసుకుంది, ఎర్రటి దుప్పట్టా.. పైకి మడిచి క్లిప్ పెట్టుకున్న జుట్టు, ముక్కుకి గులాబీరంగులో ఉన్న కెంపు ముక్కుపుడక. ప్రశాంతతే ఆభరణంగా అమ్మ ముఖం.

రోజూ యోగా చేస్తుంది, క్రమం తప్పకుండా వాక్ . మితంగా తింటుంది, ఎప్పుడూ చలాకీగా, చురుగ్గా ఉంటుంది. అందుకే అమ్మ తన వయసుకన్నా చిన్నగా, అందంగా ఉంటుంది. నాకు అమ్మ అంటే నమ్మరు, అక్కనుకుంటారు.

నాకు టిఫిన్ పెట్టి తను క్రాస్ వర్డ్ చేస్తోంది.. మధ్య మధ్యలో ఫోన్ చూసుకుంటోంది..

" ఏంటమ్మా ? అన్ని మెసేజ్ లే?" అడిగాను చిన్నగా నవ్వుతూ..

" అవునా! ఈ మధ్యనే మా ఎం. ఎస్. సీ ఫ్రెండ్స్ కొందరు కలిశారన్నానుగా, వాళ్ళో కొత్త గ్రూప్ పెట్టారు, ఏముందీ? మామూలే! ఫార్వర్డ్ లు.. ప్రవచనాలు" అంటూ ఒక చోట ఆగిపోయింది..

ఏదో చెప్పాలి కాబట్టి చెప్తున్నట్టుగా ఉంది అనిపించింది నాకు

" ఇంకా?" అప్పటివరకూ నవ్వుతూ వింటున్న నేను అడిగిన మాట వినబడలేదనుకుంటా.. పట్టించుకోనట్టు తన ఫోన్ లోకి ముఖం పెట్టుకుని ఉండిపోయింది.

"అమ్మా, అంతా ఓకేనా?" అడిగాను మారుతున్న ఆమె ముఖకవళికలను చూస్తూ..

" యా, యా"అంది గబ గబా తన రూములోకి నడుస్తూ. చిన్న కంగారు తన నడకలో..

నేను అది గమనించనట్టుగా ఊరుకుండిపోయాను. ఆ తర్వాత కావ్య తో మాట్లాడి క్లినిక్ కి బయలుదేరాను నిమిషకి ఫోన్ లో ముద్దు పెట్టి..

అమ్మ ఎందుకో కొద్దిగా కంగారు పడిందనేది నిజం.. కానీ ఎందుకో నాకర్థం కాలేదు. గత నాలుగురోజులుగా అమ్మ అన్యమనస్కంగానే ఉంటోంది నిజానికి. నిమిషని మిస్ అవుతోందేమో అనుకున్నాను కానీ ఇప్పుడనిపిస్తోంది మరేదో ఉందని.

అప్పుడే వెంటనే అడిగి ఆమెనింకా ఇబ్బంది పెట్టడం నాకిష్టం లేకపోయింది.. ఎప్పటిలాగే ' అమ్మా వెళ్ళి రానా?" అంటూ చెప్పి బయలుదేరాను..

సరే అంది తప్ప ఎప్పటిలా ' కార్ నెమ్మదిగా నడుపు', 'రోడ్డు మీద జాగ్రత్త 'లాంటి మాటలేమీ చెప్పలేదు..

బయటకు వచ్చి తలుపు వేసుకుంది మౌనంగా. ఫోన్ ఆమె చేతిలోనే ఉంది అంతసేపు..

ఆమె మనసు, దేనిగురించో ఆలోచనలో ఉందని అర్థమవుతోంది కానీ, అది ఏమిటనేది తెలీడం లేదు. అన్యమనస్కంగా ఉందని తెలుస్తోంది కానీ, కారణం ఏమిటనేది తెలీలేదు.

క్లినిక్ కి వచ్చి పేషెంట్స్ విషయంలో పడితే ఇంక ఏదీ గుర్తు రాదు. రోజెలా గడుస్తుందో తెలీదు.

" లంచ్ కి వస్తున్నావా?" అని ఎప్పటిలా అమ్మ దగ్గరనించి వచ్చే మెసేజ్ రాలేదు. కడుపులో గంట కొట్టిందిగా టైమయిందని. మిగిలిన ఇద్దరినీ చూసి పంపేసి మధ్యాహ్నపు భోజనానికి ఇంటికి వెళదామనుకుని లేవబోతున్నంతలో ఎదురుగా వచ్చి కూర్చున్నాడాయన.

" టైమయిపోయిందండి" అన్నాను నెమ్మదిగా..

" తెలుసు బాబూ, నేను పేషెంట్ ని కాను, ప్రస్తుతానికి" అన్నాడాయన నవ్వుతూ.. అప్పుడు చూశాను ఆయన వైపు పరిశీలనగా.. దాదాపు నా ఎత్తే! మంచి ధృఢమైన శరీరం, చల్లని చిరునవ్వు..

మరో గంట గడిచింది..

అప్పుడు అమ్మ దగ్గరనించి ఫోన్.. " ఇంకా రావడం లేదా? అని"

" పర్వాలేదే! నేను గుర్తున్నాననన్నమాట!" అన్నాను చిన్నగా వెక్కిరిస్తూ..

" అదేం మాట నాన్నా? నీ తర్వాతే నాకెవరైనా!" అమ్మ మనసంత నిజం ఆ మాట. నాన్న పోయిన తర్వాత నన్ను కంటికి రెప్పలా చూసుకుంది. నా ఇష్టాలని గౌరవిస్తూ, నా కంటూ స్వంత వ్యక్తిత్వం పెంపొందేలా పెంచింది. అందుకే అమ్మంటే నాకు గొప్ప గౌరవం.

“ఇప్పటికే మూడవుతోంది గా అమ్మా! మరో గంట ఆగి ఒకేసారి వచ్చేస్తాలే! మరొ ఇద్దరున్నారుట ఈ పూటకి,అంతే! నీకొడుకు బొత్తిగా ప్రాక్టీస్ లేని డాక్టరయిపోతున్నాడు” అన్నాను నవ్వుతూ..

తను కూడ నవ్వింది. ' సరే, నీ ఇష్టం" అంటూ..

మరో గంటన్నర పట్టింది నా పని, మధ్యలో ఆకలికి తెప్పించుకున్న టిఫిన్ పూర్తయ్యేసరికి.

మరో అరగంటకి ఇంటికి చేరాను. నేను తలుపు తీసుకుని లోపలకి వచ్చేసరికి సాయంత్రం నీరెండ ముఖం మీద పడుతు ఉంటే చేతిలో టీ కప్పుతో బాల్కనీలో కూర్చుని ఉంది అమ్మ.

" దా ! నీకు కూడా టీ చెయ్యనా?" అంది చిరునవ్వుతో..

నేను ముఖం కడుక్కుని బట్టలు మార్చుకుని వచ్చేసరికి నా చేతిలో పొగలు కక్కుతున్న వేడి టీ. అమ్మ వైపే చూశాను కప్పు చేతిలోకి తీసుకుంటూ..

అమ్మ ఎదురుగా అస్తమయానికి సిద్ధమవుతున్న సూర్యుడినే చూస్తోంది.

" మన క్లినిక్ కి ఈ రోజు ఒక ప్రొఫెసర్ వచ్చారు” అన్నాను నెమ్మదిగా.

" రాజ్ వచ్చాడా? " అంది హఠాత్తుగా. ఫక్కున నవ్వాను నేను. “నీకెలా తెలుసు? నేను పేరు చెప్పలేదుగా ! “అన్నాను..

అమ్మ మాట్లాడలేదు..

" అవునమ్మా, ఆయనే వచ్చారు. ప్రొఫెసర్ రాజ్ కిషోర్”.. అన్నాను..

“వచ్చి??” అంది .. తెల్లని అమ్మ ముఖంలో ఏదో తెలీని కంగారు ఎర్రగా పాకింది.. మలిసందె వర్ణంతో పోటీ పడుతోంది ఆ నారింజ రంగు..

" వచ్చి ఏముందమ్మా? విషయం చెప్పారు.. " అన్నాను నేను చాలా నెమ్మదిగా..

" సుజూ!! ఏం చెప్పాడు రాజ్!, ఎప్పుడూ ఇంతే, ఎప్పటికీ పెరగని చిన్నతనమే!" అంది గబ గబ..

" అవునమ్మా, అదీ చెప్పారు.. అప్పుడు తెలీని చిన్నతనం, ఇప్పుడు ఎదిగిన చిన్నతనం" అని.. అన్నాను..

" హి ఈజ్ క్రేజీ! ఎప్పుడూ అంతే!!" అంది రవ్వంత కోపమో, విసుగో తెలీని భావన అమ్మ గొంతులో

“అప్పుడే విసుగూ, కోపమా? ఆయనేమన్నారో నేనింకా పూర్తిగా చెప్పందే?" అన్నాను నేను..

" సుజూ!!" అంది అమ్మ నన్ను వారిస్తున్నట్టుగా. నేనదేమీ పట్టించుకోకుండా

" చెప్పమ్మా! ఆయన అన్నదానిలో తప్పేమైనా ఉందా?" అన్నాను అనునయంగా.

మౌనం మా ఇద్దరి మధ్యా..

ఏమీ మాట్లాడడం ఇష్టం లేనట్టుగా ఉండిపోయింది. చిన్నప్పటినించి నన్నో స్నేహితుడిలా చూసింది అమ్మ, అందుకే మేమిద్దరం ఏ విషయమైనా అరమరికలు లేకుండా మాట్లాడుకోగలం. నాకు తెలుసు నేను మాట్లాడుతున్నదెంత సున్నితమైన విషయమో! అయినా సరే నేను తగ్గదలుచుకోలేదు.

కానీ అమ్మ లా అనుకున్నట్లుగా లేదు. నెమ్మదిగా లేచి వెళ్ళిపోయింది తన గదిలోకి..

ఆయన చెప్పిన అక్షరమక్షరం గుర్తొస్తున్నాయి నాకు.. నన్ను చూస్తూనే తల మీద చెయ్యి వేసి నిమిరాడాయన.

" చెప్పండి ఏమిటి ప్రోబ్లెం?" అన్నాను చిరునవ్వుతో.

" రాంగ్ టైమింగ్.. ఎప్పుడూ అదే ప్రాబ్లెం, అప్పుడూ, ఇప్పుడూకూడా “అన్నారాయన.

" ఎక్స్క్యూజ్ మీ, అంటే???" అన్నాను నాకర్థం కాలేదు నిజంగానే.

" చెప్తాను, ముందు నన్ను నేను పరిచయం చేసుకుని ఆ తర్వాత.”. అన్నారాయన కళ్ళ జోడు తీసి జేబులో పెట్టుకుంటూ..

' నా పేరు రాజ్ కృష్ణ, నేను ప్రొఫెసర్ గా పనిచేస్తున్నాను, మీ అమ్మ ఫ్రెండ్ ని” అన్నారు..

" అలాగా? చాలా సంతోషం! నేనెలాగూ లంచి కి వెళ్ళే టైమయింది. ఇంటికి కలిసి వెళదాం. అమ్మ ఇంట్లోనే ఉంది, మీరు కలవవచ్చు" అన్నాను.

ఆయన మాట్లాడలేదు.. ఆ తర్వాత నెమ్మదిగా ' వద్దులే అయ్యా! మీ అమ్మ మనసు నొప్పించానేమో అనిపిస్తోంది ఇప్పటివరకూ, ఇప్పుడు ఇంటివరకూ కూడానా?" అన్నారు

అర్థం కాలేదు నాకు. “అమ్మని కలిశారా మీరు? మనసు నొప్పించడం ఏమిటి? ఏమయింది? అన్నాను” ఆత్రుతతో

“కలవడం అంటే ఒకటి రెండు సార్లు కలిశాను ఈ మధ్యనే. కానీ కంగారు పడ్డానేమో! “అన్నాడు

" ఓ! కలిస్తే ఇంకేం మరి?" అన్నాను

" కలిసే తప్పు చేశానేమో! అక్కరలేని ప్రశ్నలేసి"అన్నాడాయన అపాలజిటిక్ గా..

కొద్దిగా అర్థం అవుతూ అవనట్టుగా ఉంది. అందుకే ఆయన్నే అడిగాను “మీరేమీ అనుకోకపోతే ఏం జరిగిందో కాస్త వివరంగా చెప్పండి. అమ్మ కూడా గత రెండు రోజులుగా ముభావంగానే ఉంది” అన్నాను..

“నాకేదైనా డైరెక్ట్ గా చెప్పడమే వచ్చు, లేకపోతే చెప్పనేలేను.. ఒకసారి అలా చెప్పకుండానూ, ఇప్పుడు డైరెక్ట్ గా చెప్పి తప్పు చేశాను. అదే నేనన్నది ఇందాకా.

ఇలా నీతో చెప్పచ్చా, లేదా? అని కూడా నాకు తెలీదు, తెలిసిందల్లా నా మనసులోని దిగులు ఎలా తీరుతుందా? నేను సారీ చెప్పవలసిన వాళ్ళకి అది ఎలా చేరుతుందా? అని

మీ అమ్మా, నేను ఎం.ఎస్.సీ లో క్లాస్ మేట్స్ మి, ఆమెని చూసిన తొలిరోజునించీ మొదలైంది ఇదీ, అని చెప్పలేని అభిమానం. అప్పట్లో మా మధ్య ఉన్న భాష, స్థాయి లాంటి బేధాల వల్ల నా ఇష్టాన్ని, ఇంకా అందంగా చెప్పాలంటే ఆమె మీదున్న ప్రేమని నేను చెప్పలేక పోయాను. మనసులోనే దాచుకున్నాను. ఆమె నవ్వూ, నడకా, పిలుపూ, తలపు అన్నీ నాకు మధుర జ్ఞాపకాలే. ఈరోజుకీ.. సారీ ఇవన్నీ ఇప్పుడు చెప్పడం లో నాకుమరో రకమైన ఉద్దేశ్యమేమీ లేదు..

ఆ తర్వాత ఆయన చెప్పినది ఒకటే ధ్యాసగా విన్నాను. రెండు నిమిషాల పాటు నాకేం చెప్పాలో తోచలేదు.

మీ తాతగారు ఈ ఊర్లోనే పెద్ద వకీలు, ఆయనకున్న అస్థిపాస్తులగురించీ, ఒకతే సంతానమైన మీ అమ్మ గురించీ అందరూ ఎంతో గొప్పగా చెప్పుకునేవారు. ఆమె కాళ్ళు కందకుండా అరచేతుల్లో నడిపించారనీ, ఆమె సంతోషం, సుఖం మాత్రమే ఆయనకన్నీ అని ఇలా రకరకాలుగా చెప్పేవారు. చదువులో ఎంతో చురుగ్గా ఉండేది మీ అమ్మ, ఆటపాటల్లోనూ అంతే, చూడచక్కని రూపం. ఆమెనిష్టపడేవాళ్ళు ఎంతో మంది.

ఈ మధ్యలో ఎక్కడనించో వచ్చిన అనామకుడ్ని నన్నేం గుర్తిస్తుందని బెదురుతో నా మనసులో మాట చెప్పకుండా నే ఊరుకుండిపోయాను. అది చెప్తే కనీసం ఈ స్నేహం కూడా మిగలదేమో ? అన్న పెద్ద సందేహం వేరే నా మనసులో ఉండేది.

తనంటే నాకిష్టమనే భావం తనకి తెలిసినట్టే ఉండేది సుప్రజ,కానీ అంతకు మించి ఆమె ఏమీ అనేది కాదు.

దానివల్ల నా పిరికి మనసు ముందుకు సాగేదే కాదు.మన భావాల్తో సంబంధం ఉంటుందా కాలానికి? దాని మానాన అది పరిగెత్తింది. ఆమెతో పలకలేక, మరువలేక నేనిలాగే ఉండిపోయాను.

టెక్నాలజీ పుణ్యాన కలిసిన రీయూనియన్ పార్టీలో సుప్రజని ఇన్నేళ్ళ తర్వాత తిరిగి చూసిన ఆనందం నేను మాటల్లో చెప్పలేను. నీ గురించి విన్నప్పుడెంత సంతోషించానో, మీ నాన్నగారి గురించి విన్నప్పుడంత బాధ పడ్డాను.

ఆతర్వాత సుప్రజ ని నా పుట్టినరోజు సందర్భంగా లంచ్ కి ఆహ్వానించాను. అరమరికలు లేకుండా చిన్న తనంలోకి వెళ్ళిపోయి ఎన్నో కబుర్లు చెప్పుకున్నాం. అదే చిన్నతనంతోనే అనుకుంటా ' నీ మనసులో నాకింత చోటుంటుందా?" అన్న ఒక ప్రశ్న, అది కూడా ముఖత: వెయ్యలేక మెసేజ్ పంపాను. ఫూల్ ని

స్వతహాగా సున్నిత మనస్కురాలు, ఏమనుకుందో? సమాధానం చెప్పలేదు. గత రెండు రోజులుగా అయితే ఆమె దగ్గరనుంచి అసలే మెసేజ్ లేదు. ఫోన్ చేసినా ఎత్తలేదు.

చెప్పానుగా నాన్నా! నిజానికి నేనలా ఎందుకడిగానో కూడా నాకర్థం కావడం లేదు. ఆమె మనసునొప్పించినట్టయితే సారీ చెబ్దామంటే కూడా అవకాశం దొరకడం లేదు. అదే నీతో చెబ్దామనే ఇలా వచ్చాను. వీలుంటే ఈ స్నేహితుడిని మన్నించమని" అంటూ లేచారాయన.

సన్నగా కంపిస్తున్న ఆయన సున్నితమైన మనసు గొంతులో వినిపిస్తోంది. ఎంతో అభిమానించిన స్నేహితురాలు మళ్ళీ దూరమైపోతుందేమోనన్న బాధ తొణికిసలాడుతోంది ఆ గొంతులో

" వస్తాను నాన్నా!" నెమ్మదిగా నా చేతిని తడుముతూ వెళ్ళడానికి ఉద్యుక్తుడయ్యాడతను..

కలలో ఉన్నట్టుగా ' సరే" అన్నాను. ఆయనని ఆపాలని కూడా తోచలేదు నాకు.

తేరుకున్నాకా వెంటనే కావ్యతో ఫోన్ లో మాట్లాడాను, తనే చక చకా ఏం చెయ్యచ్చో చెప్పింది. ఆ పైన మిగిలిన ఇద్దరు పేషెంట్లని చూసేసి, సాయంత్రానికి ఉన్న అపాయింట్మెంట్లన్నీ కాన్సిల్ చేయించాను. అమ్మతో ప్రశాంతంగా మాట్లాడడానికి.

మరో అరగంటలో వచ్చేసింది కావ్య నిమిషని తీసుకుని.

" రామ్మా, కావ్యా! రెండు రోజులు ఉంటానన్నావు గా!" అంది నిమిషని ఎత్తుకుంటూ..

" మళ్ళీ వెళతాలే ఆంటీ! ఎంత దూరం, ప్రస్తుతం చెయ్యాల్సిన పనులన్నీ అయిపోయాయి. ఎంగేజ్ మెంట్ అయ్యాకా మళ్ళీ పెళ్ళి పనులెలాగూ ఉంటాయి కదా! అంది నా వైపు చూసి నవ్వింది.

రాత్రి భోజనాలయ్యాకా లివింగ్ రూములో కూర్చుని ఉన్నాము. అమ్మ ఒళ్ళో నిమిష పడుకుంది. పాప కాళ్ళ మీదకి తన చీర చెంగు కప్పింది. ఒక్క క్షణం వదలదు నిమిషని అమ్మ

" అమ్మా ప్రొఫెసర్ సారీ చెప్పమన్నారు. విన్నావుగా! ఆయన పాపం ఎంత బాధ పడ్డారో తెలుసా? నువ్వు ఫోన్ చెయ్యలేదని" అన్నాను నెమ్మదిగా.

'ఊ ' అంది అమ్మ అభావంగా.

"ఆయన చెప్పిన సారీ సరే! అసలాయ చెప్పదలుచుకున్న విషయమో?" అంది కావ్య నాకన్నా నెమ్మదిగా.

అమ్మ చురుగ్గా చూసింది కావ్య వైపు.

' నేనన్నది కానీ, ఆయనన్నది కానీ తప్పు కాదు గా ఆంటీ! మీరిద్దరూ బాగా చదువుకున్నవారు, అన్నీ తెలిసినవారు. ఒకరికొకరుగా ఉండవలసిన వయసులో స్నేహంగా ఉంటే తప్పేమిటి? మీ ఇద్దరికీ ఇష్టమైనప్పుడు ఒకటైతే మాత్రం తప్పేమిటి?

మీవల్లనే ఆయన మరొకరిని ఆహ్వానించలేదు తన జీవితంలోకి. మరొకరిని ఆహ్వానించిన మీరు త్వరలోనే ఆ తోడుని కోల్పోయారు. ఇన్నేళ్ళకి కలవడం, ఇలా జరగడం, ఇదంతా మంచికే అనుకోవచ్చుగా ఆంటీ. ఆయన కంగారు పడినా, నిజంగా ఇదే ఆశించారా, లేదా తెలియకపోయినా అలా చెప్పి మంచి పనే చేశారని నేను అనుకుంటాను. దయచేసి ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకోకండి ఆంటీ. దాదాపుగా వందో సారి అంది కావ్య..

అవునమ్మా! ఏ వయసులోనైనా మనల్ని అభిమానించి, అభిరుచులు కలిసే తోడు దొరకడం ఎంత అదృష్టం. నేను కూడా మరో ఫెలోషిప్ కి బయటకు వెళదామని అనుకుంటున్నా కదా! నువ్వొక్కదానివే ఉండాలి కదా. గొణిగినట్టే కావ్యకి వంత పాడాను.

అమ్మ కళ్ళు మూసుకుని సోఫా మీదకి తల వాల్చుకుంది. మేమిద్దరం ఉత్కంఠగా ఆవిడనే చూస్తున్నాం.

●●●

Click here to share your comments on this story